జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

శుక్రవారం | 3-4-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 633 పేజీలు: 4 వెల : రూ.7

# అమరావతికి.. జై



- * పార్లమెంట్‌లో రాష్ట్ర రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ బిల్లు
- * జిల్లావ్యాప్తంగా విజయోత్సవాలు
- * కూటమి శ్రేణుల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ
- * ప్రజా రాజధానిగా అమరావతి: మంత్రి అచ్చెన్న
- * చరిత్రలో నిలిచేలా.. బిల్లు: కేంద్ర మంత్రి రామ్మోహన్
- * సుస్థిరతకు, రాష్ట్ర ప్రగతికి, అభివృద్ధికి ఇదొక కొత్త నాంది:కలెక్టర్

**శ్రీకాకుళం, ఏప్రిల్ 2 (వార్త):** రాష్ట్ర రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ పార్లమెంట్‌లో బిల్లు ఆమోదించడంతో జిల్లాలో విజయోత్సవాలు మిన్నంటాయి. గురువారం జిల్లా అంతటా కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు సంబరాలు చేసుకున్నారు. కేకులు కట్ చేశారు. బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు అమరావతికి జై అంటూ భారీ ర్యాలీ చేశారు. ప్రభుత్వానికి మద్దతు ఇస్తూ ప్రజలు సైతం తమ ఇళ్ల వద్ద కొవ్వొత్తులు వెలిగించారు. ప్రభుత్వ కార్యాలయాల వద్ద అధికారులు, సిబ్బంది సంబరాలు చేసుకున్నారు.

## ప్రజా రాజధానిగా అమరావతి: మంత్రి అచ్చెన్న



అమరావతి చట్టబద్ధత బిల్లును పార్లమెంట్ ఉభయ సభలు ఏకగ్రీవంగా ఆమోదించడం పట్ల వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఇది రైతుల త్యాగాలకు న్యాయం చేసిన చారిత్రాత్మక ఘట్టమని పేర్కొన్నారు. ప్రజారాజధాని అమరావతి కోసం 29 వేల మంది రైతులు స్వచ్ఛందంగా 33 వేల ఎకరాల భూమిని ఇచ్చి దేశంలోనే అరుదైన ఉదాహరణగా నిలిచారని తెలిపారు. 1600 రోజుల పాటు నిరంతర పోరాటం చేసిన రైతులు, మహిళల ఉద్యమానికి ఆయన సెల్యూట్ చేస్తూ, ఉద్యమ సమయంలో మహిళలను సైతం వదలకుండా జరిగిన దాడులు ప్రజాస్వామ్యానికి మచ్చగా నిలిచాయని తీవ్రంగా ఖండించారు. గత 12 ఏళ్లుగా రాజధానిపై కొనసాగిన అస్పష్టత రాష్ట్ర అభివృద్ధి, పెట్టుబడులపై తీవ్ర ప్రభావం చూపిందని, మూడు రాజధానుల పేరుతో రాష్ట్రాన్ని రాజధాని లేకుండా చేసిన గత ప్రభుత్వ విధానాలను ప్రజలు తిరస్కరించారని పేర్కొన్నారు. ఎన్నికల ముందు వైసీపీ అమరావతికి మద్దతు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత మాట తప్పిన వైఖరిని ప్రజలు గట్టిగా ఎదుర్కొన్నారని, ప్రాంతాల మధ్య విభేదాలు సృష్టించే కుట్రలను ప్రజలు తిప్పికొట్టారని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టితో అమరావతి ప్రపంచ స్థాయి రాజధానిగా అభివృద్ధి చెందేందుకు పునాది పడిందని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వికసిత్ భారత్ సంకల్పం రాష్ట్ర అభివృద్ధికి బలమైన దిశను చూపుతోందని తెలిపారు. అమరావతి కేవలం రాజధాని మాత్రమే కాదని, ఇది ఐదుకోట్ల ఆంధ్రుల గుండెచప్పుడు, రైతుల త్యాగాలకు ప్రతీక అని స్పష్టం చేశారు. రాజధానిపై ఎమ్మెల్యే జగన్ వక్రబుద్ధి ఎప్పటికీ మారదని, రాష్ట్రానికి న్యాయం చేస్తారనే మాటలు హాస్యాస్పదంగా ఉన్నాయని విమర్శిస్తూ, 'మావిగన్' వంటి ప్రతిపాదనలు ఆయన చంచల వైఖరికి నిదర్శనమని అన్నారు. అమరావతి చట్టబద్ధత బిల్లు ఆమోదం గత ప్రభుత్వ వైఫల్యాలకు గట్టి సమాధానంగా నిలిచిందని పేర్కొన్నారు.

## చరిత్రలో నిలిచేలా.. బిల్లు: కేంద్ర మంత్రి రామ్మోహన్

ఒక పవిత్రమైన, శక్తివంతమైన నేలపై ఎవరెన్ని కుట్రలు పన్నాలని చూసినా.. అమరావతి విషయంలో ఒక్క ఇటుక కూడా కదల్చలేకపోయారని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. గురువారం రాజ్యసభలో అమరావతి చట్టబద్ధత బిల్లును కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ ప్రవేశపెట్టగా.. చర్చకు చైర్మన్ సిపి రాధాకృష్ణన్ అనుమతిని ఇచ్చారు.



కొనసాగింపు ప్రసంగాన్ని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు చేశారు. ఇంకోవైపు రాజ్యసభలో బిల్లు ఆమోదం పొందిన తీరును రాష్ట్రానికి చెందిన ఎన్డియే ఎంపిలతో కలిసి మంత్రి నారా లోకేష్ వీక్షించారు. అంతకుముందు లోక్ సభలో బిల్లుకు మద్దతు ఇచ్చినందుకు ప్రధాని మోదీ తో కూడా భేటి అయ్యి కృతజ్ఞతలు తెలిపారు. చారిత్రాత్మక బిల్లు రాజ్యసభలో అడుగిడిన వేళ కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు కీలక ప్రసంగాన్ని చేశారు. తెలుగు ప్రజలందరికీ ఇది చారిత్రాత్మకమైన రోజుగా అభివర్ణించారు. చరిత్రలో ప్రజా రాజధానిగా అమరావతి గుర్తుంటుందని చెప్పారు. అమరావతికి చట్టబద్ధత బిల్లు ప్రవేశపెట్టడాన్ని తెలుగు ప్రజలంతా గర్వంగా భావిస్తున్నారని రామ్మోహన్ నాయుడు అన్నారు. విభజన సమయంలో ఒక రాష్ట్రానికి రాజధాని ఉంది.. మరో రాష్ట్రానికి అలా లేకుండా వదిలేయడంతో సమస్య మొదలైందని అన్నారు. దేశంలో చాలాసార్లు విభజనలు జరిగాయి కానీ. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విభజన సమయంలో అనేక ఇబ్బందులు ఎదురయ్యాయని అన్నారు. అమరావతిని రాజధానిగా చేస్తూ పాలన అందిస్తామని 2024 ఎన్నికల్లో ఇచ్ఛాపురం నుండి హిందూపురం వరకు ఒకటే నినాదంతో ఎన్డియే కూటమి ప్రజల్లోకి వెళితే స్పష్టమైన హామీతో మళ్ళీ మాకు అధికారం ఇచ్చారని.. వారి ఆశలు నేడు చట్టబద్ధత బిల్లుతో నెరవేరాయని రామ్మోహన్ నాయుడు అన్నారు.

## శ్రీకాకుళంలో భారీ ర్యాలీ

శ్రీకాకుళంలో పాతబస్టాండ్‌లోని పొట్టిశ్రీరాముల విగ్రహం నుంచి ఏడురోడ్ల కూడలి వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. పొట్టిశ్రీరాములు, మహాత్మాగాంధీ, ఎన్టీఆర్, కింజరాపు ఎర్రన్నాయుడు విగ్రహాలకు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏడురోడ్లకూడలిలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ అమరావతి కేవలం పరిపాలనా కేంద్రం మాత్రమే కాదని, రాష్ట్ర ఆర్థిక, సామాజిక, పారిశ్రామిక అభివృద్ధికి కేంద్ర బిందువని అన్నారు. రాజధాని కోసం 35 వేల ఎకరాలు త్యాగం చేసిన రైతుల రుణం తీర్చుకోలేనిదని చెప్పారు.



## విశాఖ రైల్వే జోన్‌లోకి ఇచ్ఛాపురం, పలాస

* ఉత్తర్వులు విడుదల చేసిన రైల్వే బోర్డు
* రైల్వే శాఖామంత్రికి కృతజ్ఞతలు తెలిపిన రామ్మోహన్

**శ్రీకాకుళం, ఏప్రిల్ 3(వార్త):** విశాఖ సౌత్ కోస్ట్ రైల్వే జోన్‌లో ఇచ్ఛాపురం నుండి పలాస మధ్య ప్రాంతాలు విలీనం అయ్యాయని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. శ్రీకాకుళం జిల్లాకు, ఉత్తరాంధ్ర ప్రాంతానికి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చిరస్మరణీయమైన రోజుగా అబివర్ణించారు. రైల్వే బోర్డు నుండి వచ్చిన తాజా ఉత్తర్వుల ప్రకారం, ఈస్ట్ కోస్ట్ రైల్వే పరిధిలోని ఖుర్దా రోడ్ డివిజన్‌లో ఇప్పటివరకు ఉన్న ఇచ్ఛాపురం నుండి పలాస మధ్య రైల్వే ప్రాంతం ఇప్పుడు విశాఖ కేంద్రంగా ఉన్న సౌత్ కోస్ట్ రైల్వే జోన్ పరిధిలోకి చేరిందని తెలిపారు. రాష్ట్ర విభజన సమయం నుండి విశాఖ రైల్వే జోన్ కోసం నిరంతరంగా పోరాటం సాగించామని.. పార్లమెంట్‌లో, వివిధ వేదికల్లో ఉత్తరాంధ్ర ఆకాంక్షలను పదేపదే ప్రస్తావించినట్లు గుర్తు చేశారు. ఆ పోరాటాల ఫలితంగానే విశాఖ సౌత్ కోస్ట్ రైల్వే జోన్ ఆవిర్భవించినప్పటికీ.. ఆ జోన్ పరిధిలో ఇచ్ఛాపురం - పలాస మధ్య ప్రాంతం లేకపోవడం తనకు వెలితిగా ఉండేదన్నారు. ఇదే విషయాన్ని పలు మార్లు కేంద్ర రైల్వే శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ తో భేటిలో వివరించి, ఖుర్దా రోడ్ డివిజన్‌లోని ఇచ్ఛాపురం - పలాస మధ్య ప్రాంతాన్ని సౌత్ కోస్ట్ విశాఖ జోన్‌లోకి మార్చాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.

### నేరడి బ్యారేజికి లైన్ క్లియర్

వంశధార నదిపై నేరడి బ్యారేజి నిర్మాణానికి సంబంధించి నదీ జలాల ట్రిబ్యునల్ తుది తీర్పు ఇవ్వడం, దానికి అనుగుణంగా కేంద్ర జలశక్తి శాఖ తుది గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడం ఆనందంగా ఉందని రామ్మోహన్ నాయుడు అన్నారు. ఈ తీర్పుతో వంశధార నదిపై నేరడి బ్యారేజి, దానికి సంబంధించిన అనుబంధ నిర్మాణాల ఏర్పాటుకు అన్ని ఆటంకాలు తొలగిపోయాయని అన్నారు.



## సుస్థిరతకు, రాష్ట్ర ప్రగతికి, అభివృద్ధికి ఇదొక కొత్త నాంది:కలెక్టర్

సుస్థిరతకు, రాష్ట్ర ప్రగతికి, అభివృద్ధికి ఇదొక కొత్త నాంది అని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కొనియాడారు. అమరావతి చట్ట బద్ధతపై పార్లమెంటు ఉభయ సభల్లో ఆమోదం పొందిన నేపథ్యంలో కలెక్టర్ కార్యాలయ ఆవరణలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలసి కేక్ కటింగ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజధానిగా అమరావతికి చట్టబద్దత లభించడం, పార్లమెంటులోని ఉభయ సభల్లో 'ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ (సవరణ) బిల్లు, 2026' ఏకగ్రీవంగా ఆమోదం పొందటంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రజల సుదీర్ఘ నిరీక్షణకు, వారి సంకల్పానికి జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిందని, ఐదు కోట్ల ఆంధ్రుల ఆకాంక్షలు నేడు దేశ రాజధానిలో ప్రతిధ్వనించాయని ఆయన అన్నారు. అమరావతిని రాజధానిగా పేర్కొంటూ పార్లమెంట్ తీసుకున్న ఈ నిర్ణయం రాష్ట్రంలో ఒక కొత్త శకానికి నాంది పలికిందన్నారు. అమరావతి ఒక అద్వితీయమైన భవిష్యత్ నగరంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీ రాజ్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి వి. విశ్వేశ్వరావు, డిఎస్‌ఓ సూర్య ప్రకాష్, పంచాయతీ రాజ్ ఎస్ ఈ వీరన్నాయుడు, జిల్లా ఉపాధి అధికారి కొంతలెంక సుధ, భూగర్భ గనుల శాఖ డిడి మోహనరావు, ఇతర జిల్లా అధికారులు, కలెక్టరేట్ పరిపాలనాధికారి జి.ఎ.సూర్యనారాయణ, కలెక్టరేట్ కార్యాలయ వివిధ విభాగాల పర్యవేక్షకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



కనులపండువగా

## ఆదిత్యునికి పుష్పార్చన

అరసవల్లి, ఏప్రిల్ 3 (వార్త): అరసవల్లి సూర్యనారాయణస్వామి దేవస్థానంలో గురువారం ఉషా,పద్మిని,ఛాయా సమేత స్వామివారి పుష్పయాగమహోత్సవం కనులపండువగా నిర్వహించారు. పలు రకాల పుష్పాలతో స్వామి వారికి అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ ఆధ్వర్యంలో స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు.

5, 6 తేదీల్లో జిల్లాలో

## మంత్రి జనార్ధన్ రెడ్డి పర్యటన

* 6న మూలపేట పోర్టు పనులపై సమీక్ష: జిల్లా కలెక్టర్

**శ్రీకాకుళం, ఏప్రిల్ 2(వార్త):** రాష్ట్ర రహదారులు, భవనాలు, మౌలిక వసతులు, పెట్టుబడుల శాఖ మంత్రి బి.సి. జనార్ధన్ రెడ్డి ఈ నెల 5, 6 తేదీల్లో శ్రీకాకుళం జిల్లాలో పర్యటించనున్నట్లు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. షెడ్యూల్ ప్రకారం, 5వ తేదీ రాత్రి 7:30 గంటలకు జిల్లాకు మంత్రి చేరుకుంటారు. ఆ రాత్రికి ఆయన శ్రీకాకుళంలోనే బస చేస్తారు, 6వ తేదీ ఉదయం 8 గంటలకు శ్రీకాకుళం నుండి బయలుదేరి 9 గంటలకు మూలపేట పోర్టుకు చేరుకుంటారు. ఉదయం 9 గంటల నుండి 11:30 గంటల వరకు పోర్టు నిర్మాణ పనులను మంత్రి క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారు. అనంతరం అధికారులతో పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహిస్తారని వెల్లడించారు. కార్యక్రమం ముగిసిన తర్వాత సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు మూలపేట నుండి రోడ్డు మార్గంలో మంత్రి తిరిగి తాడేపల్లికి ప్రయాణమవుతారని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వివరించారు.

# అచేతన స్థితిలో అనాథ వృద్ధుడు

**-అనాథాశ్రమంలో చేర్పించాలని**

**ప్రజల అభ్యర్థన**

**మెళియాపుట్టి, ఏప్రిల్ 2(వార్త):** మారుమూల గిరిజన ప్రాంతానికి చెందిన ఓ గిరిజన వృద్ధుడు నాలుగు రోజుల నుంచి అన్న పానీయాలు లేక తీవ్ర నిస్సహాయ స్థితిలో పడి ఉన్నాడు. మెళియాపుట్టి వేణుగోపాల స్వామి ఆలయానికి ఎదురుగా ఉన్న ఉన్న వెజిటబుల్ మార్కెట్ ప్రాంగణంలో కేరసింగి గిరిజన గ్రామానికి చెందిన గోపాలపురం భీమారావు కొన్ని రోజులుగా అన్న పానీయాలు లేక, శరీరం సహకరించక ఆకలితో కదలలేని పరిస్థితుల్లో అక్కడే పడి ఉన్నాడు. ఆయనతో మాట్లాడేందుకు ప్రయత్నించగా, నోటి నుంచి మాటలు రావడం లేదు. దీంతో స్థానికులు పలువురు తినేందుకు ఏదో ఇస్తున్నా.. భీమారావు తినే పరిస్థితి కనిపించడం లేదు. ఈ వృద్ధుడిని అనాథాశ్రమంలో చేర్పించే విషయమై స్థానిక మండల స్థాయి అధికారులు సమన్వయంతో వ్యవహరించి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని మండల ప్రజానీకం కోరుతున్నారు.




## బహడపల్లిలో ఎన్టీఆర్ పింఛన్ల పంపిణీ



**మందస, ఏప్రిల్ 2(వార్త):** బహడపల్లి గ్రామంలో ఎన్టీఆర్ సామాజిక భద్రతా పింఛన్లను తెలుగుదేశం పార్టీ మందస మండల ప్రధాన కార్యదర్శి సాలిన మాధవరావు పంపిణీ చేశారు. బహడపల్లి పంచాయతీలో కొత్తగా మంజూరైన కిడ్నీ డయాలసిస్ పేషెంట్ సాలిన చంద్రమ్మకు 10,000 రూపాయలను పలాస నియోజకవర్గం శాసన సభ్యురాలు గౌతు శిరీష ఆదేశాల మేరకు అందజేశారు. కార్యక్రమంలో మందస మండల ప్రధాన కార్యదర్శి సాలిన మాధవరావు, సార నిరంజన్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రిటైర్డ్ ఉద్యోగి 'వజ్జ కృష్ణారావు' మృతి



**మందస, ఏప్రిల్ 2(వార్త):** మందస పట్టణానికి చెందిన పశుసంవర్ధక శాఖ రిటైర్డ్ ఉద్యోగి వజ్జ కృష్ణారావు అనారోగ్యంతో మరణించారు. పశు సంవర్ధక శాఖలో ఉద్యోగిగా మందస, హరిపురంలలో ఎక్కువకాలం ఆయన పని చేశారు. కాళింగకుల నాయకునిగా కూడా గుర్తింపు పొందారు. మృతునికి భార్య సావిత్రి, కుమారుడు పాపారావు, కుమార్తె జయశ్రీ ఉన్నారు. కృష్ణారావు మరణించిన విషయం తెలుసుకున్న రిటైర్డ్ తహసీల్దార్ దువ్వు రామారావు, రిటైర్డ్ ఉపాధ్యాయులు వాయలపల్లి నారాయణరావు, గుంట కేశవరావు, మందస మండలం విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు ఆయన కుటుంబాన్ని పరామర్శించి, సంతాపం తెలిపారు.

## ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోవాలి



**మందస, ఏప్రిల్ 2(వార్త):** మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ హామీ పథకం పేరు వీబీజీ రాంజీగా మార్పు జరిగాక జరుగుతున్న పనులను సద్వినియోగం చేసుకోవాలని వక్తలు అన్నారు. మందస మండలం భైరిసారంగపురం పంచాయతీలో గల రాధాకృష్ణపురం గ్రామంలో ఈ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళలు, వేతనదారులు అడవితల్లి, కొండతల్లి, జల్లిభద్రమ్మతల్లి తదితర దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. పనులకు నిర్ణీత సమయాన్ని పాటించాలని, పూర్తిస్థాయిలో పనులు చేయాలని కోరారు. కార్యక్రమంలో గుసిరి తాతయ్య, పొందూరు మన్మధరావు, ఫీల్డ్ అసిస్టెంట్ జీరు పాపారావు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

## అమరావతికి జన హారతి

**- సంబరాలు జరిపిన డ్వాక్రా మహిళలు**



**సోంపేట, ఏప్రిల్ 2(వార్త):** తెలుగు ప్రజల కల సాకారం అయినవేళ రాష్ట్ర రాజధాని అమరావతికి కేంద్రం చట్టబద్ధత కల్పించిన నేపథ్యంలో మహిళలు ఎంతో ఆనందం వ్యక్తం చేస్తూ సంబరాలు చేసుకున్నారు. సోంపేట వెలుగు కార్యాలయం వద్ద సిబ్బందితోపాటు పలువురు వీఏవోలు అమరావతి పేరుతో అందమైన ముగ్గులు వేసి రంగులు దిద్ది దీపాలు వెలిగించి ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపును ఆత్మీయంగా స్వాగతించారు. అమరావతి రాజధానిగా ఆంధ్ర రాష్ట్రం మరింత ఉన్నత స్థాయికి చేరాలని అభివృద్ధి సంక్షేమం వృద్ధి చెందాలని కార్యాలయం అకౌంటెంట్ భారతి వీఏవోల ప్రతినిధులు పద్మ శ్రీదేవి తదితరులు పేర్కొన్నారు.

## శక్తి యాప్‌పై అవగాహన

**జలుమూరు, ఏప్రిల్ 2(వార్త):** జలుమూరు గవర్నమెంట్ గర్ల్స్ హైస్కూల్లో గురువారం శక్తి యాప్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టెక్కలి డివిజన్ శక్తి టీం హెడ్ కానిస్టేబుల్ ఎం. గిరిధర్ మాట్లాడుతూ బాల బాలికలు స్వీయ రక్షణపై అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగపడే పోలీస్ హెల్ప్‌లైన్ నంబర్లను విద్యార్థులకు వివరించారు. అలాగే నేషనల్ హైవే, గ్రామీణ రహదారులపై ప్రయాణించే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలని సూచించారు. మహిళా చట్టాలు, హక్కులపై కూడా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.




# గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

**మందస, ఏప్రిల్ 2(వార్త):** గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని గిరిజన శక్తి సంక్షేమ సంఘం, ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మందస మండలంలోని ఆంధ్రా-ఒడిశా సరిహద్దులోని గిరిజన గ్రామాల్లో గురువారం వారు పర్యటించి, గిరిజనులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో ప్రధానంగా త్రాగు నీరు సమస్య వేధిస్తోందన్నారు. గిరిజనులు అనారోగ్యం గురయితే హాస్పిటల్ చేర్పించుటకు కనీసం రహదారులు లేని పరిస్థితులు ఉన్నాయన్నారు. గిరిజనులు పండించే పంటకు గిట్టుబాటు ధరలు లేక దళారుల చేతికి అన్యాయానికి, మోసాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన చిన్నారులను చదివించుటకు సరైన బడులు లేవని, బడులు ఉంటే ఉపాధ్యాయులు లేని పరిస్థితి ఉందన్నారు. ప్రభుత్వాలు, పాలకులు వస్తూ పోతున్నా, గిరిజనుల తలరాతలు మారడం లేదన్నారు. సరిహద్దుల గిరిజనుల ప్రాంతాల అభివృద్ధి చెందాలంటే మందస మండలం కేంద్రంగా ఐటీడీఏ ఏర్పాటు చేయాలని, అప్పుడే గిరిజన సమస్యలు పరిష్కరించబడతాయన్నారు. నేటి పాలకులతో అధివృద్ధి చెందలేదని, ఇంకా అధివృద్ధి జరగదని భావిస్తున్నామని ఆవేదనను వ్యక్తపరిచారు. మందస మండలంలో ఐటీడీఏ ఏర్పాటు చేసేంతవరకు ఉద్యమాలకు, ధర్నాలకు సిద్ధంగా ఉంటామన్నారు. ఐటీడీఏతో మాత్రమే గిరిజన గ్రామాల అభివృద్ధికి సాధ్యపడుతుందని ఆయా గ్రామాల గిరిజనులు చెప్పారు. ఆంధ్ర-ఒరిస్సా సరిహద్దులలో గల మారుమూల గిరిజన గ్రామాలు అయిన హోల్దిగాం, మాణిక్యపట్నం, అక్కడ, చొంపాపురం, నువాగాం, గోపాలసాయి, బల్యాసాయి, బుడంబో, కారిబంద, లొడకపిట్ట, లోహరిబంద తదితర గ్రామాలలో సమావేశాలు నిర్వహించారు. కార్యక్రమంలో గిరిజన శక్తి సంక్షేమ సంఘం, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర రైతు కూలీ సంఘం నాయకులు సవర నరసింహులు, సభ్యులు హరికృష్ణ, బాలకృష్ణ, లక్ష్మణరావు, దాశరథి, యేసయ్య, జగన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రైతు కూలీ సంఘం నాయకుడు కోనేరు రమేష్ పాల్గొన్నారు.



# అందరి సహకారంతోనే జిల్లుండ అభివృద్ధి

**-సర్పంచ్ చింతాడ శ్రీకావ్య**



**మందస, ఏప్రిల్ 2(వార్త):** ప్రజల సహకారంతోనే జిల్లుండ పంచాయతీ అభివృద్ధి చేయగలిగామని జిల్లుండ సర్పంచ్ చింతాడ శ్రీకావ్య అన్నారు. మందస మండలంలోని ఉమాగిరిలో శ్రీకావ్య విలేకరులతో మాట్లాడుతూ జిల్లుండ పంచాయతీని తన హయాంలో అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. ప్రజలు కూడా ఎంతగానో సహకరించామన్నారు. కుల, వర్గ, రాజకీయాలకు అతీతంగా ఎన్నో అభివృద్ధి పనుల చేశామన్నారు. మండల అధికారులు, పంచాయతీ, సచివాలయం అధికారులు, సిబ్బంది ఎంతగానో సహకరించారన్నారు. తన తండి శిస్టు బాపూజీ సహాయ, సహకారాలతో ప్రణాళికాబద్ధంగా.. లక్ష్యాలను నిర్దేశించుకుని.. పంచాయతీని అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. తన తల్లి శిస్టు శారద సర్పంచ్ గా ఎన్నికైన రెండు నెలలకే మరణించారని, అనంతరం జరిగిన ఎన్నికల్లో తనకు ఏకగ్రీవంగా ఎన్నుకున్న ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. నాడు.. నేడు అన్న చందాన జిల్లుండ పంచాయతీలో అభివృద్ధి పనులు, కార్యక్రమాలు చేసి, ఆదర్శ పంచాయతీగా నిలబెట్టామన్నారు. తెలిసో.. తెలియకో పొరపాట్లు జరిగితే ప్రజలు మన్నించాలని కోరారు. తనపై నమ్మకం ఉంచిన జిల్లుండ, ఉమాగిరి, డిమిరియా గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

# ఎయిర్‌పోర్ట్ భూ సేకరణపై టి.గంగువాడ రైతుల ఆందోళన



**మందస, ఏప్రిల్ 2(వార్త):** కార్గో ఎయిర్‌పోర్ట్ భూ సేకరణను వ్యతిరేకిస్తున్నట్టు తెలగగంగువాడ రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. మందస మండలంలోని టి.గంగువాడ రైతులు పలాసలోని ఆర్డీఓ కార్యాలయం, మందస తహసీల్దార్ కార్యాలయం, స్థానిక సచివాలయంలలో అధికారులు, ప్రభుత్వ ఉద్యోగులకు అభ్యంతరాలను తెలిపారు. రాంపురం పంచాయతీ పరిధిలోని తెలగగంగువాడ గ్రామానికి చెందిన భూ బాధిత రైతులు, గ్రామ ప్రజలు కలిసి సచివాలయంలో వి.ఆర్.ఓ. మార్చి 26న అందజేసిన ప్రతిపాదిత ఎయిర్‌పోర్ట్ భూమి వివరాల జాబితాను తీవ్రంగా వ్యతిరేకత వ్యక్తం చేశారు. ప్రతిపాదిత జాబితా ప్రకారం పూర్తి స్థాయిలో భూమిని కోల్పోయే పరిస్థితి ఏర్పడుతోందని, దీంతో అనేక కుటుంబాలు జీవనోపాధి కోల్పోయి రోడ్డున పడే పరిస్థితి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే కార్గో ఎయిర్‌పోర్ట్ భూ సేకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసికొని రైతులకు న్యాయం చేయాలని వారు అధికారులను కోరారు. కార్యక్రమంలో చిత్త కూర్మారావు, చిత్త గున్నయ్య, యలమల కృష్ణా రావు, చిత్త చంద్రశేఖర్, దాసరి మోహనరావు, చిత్త సంతోష్, పుక్కల్ల నారాయణ, జోగి మోహనరావు, లైశెట్టి నారాయణ, గంట ఆనంద్, చిత్త హేమరాజు, రాకేట్ల శ్యాం తదితర బాధిత రైతులు పాల్గొన్నారు.

# పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఏ గ్రేడ్

**పలాస, ఏప్రిల్ 2 (వార్త):** పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఏ గ్రేడ్ లభించిందని పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె వెంకటలక్ష్మి తెలిపారు. పలాసలో ఫిబ్రవరి 2వ తారీఖున అకడమిక్ ఆడిట్ విజయవంతంగా నిర్వహించారు. ఈ అకడమిక్ ఆడిట్ కార్యక్రమానికి అకడమిక్ అడ్వైజర్స్‌గా ఎం. శాంతి హోం,నరసన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇంగ్లీష్ లెక్చరర్ డా.బి. వేణుగోపాల రావు, రాజాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇంగ్లీషు విభాగం లెక్చరర్ లు విచ్చేసి కళాశాల యొక్క విద్యా ప్రమాణాలు, బోధన విధానాలు, రికార్డులు, అకడమిక్ పనితీరును సమగ్రంగా గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె. వెంకటలక్ష్మి, ఐక్యుఏసి కోఆర్డినేటర్ పి. వెంకటరమణ, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అందరూ ఆడిట్ ప్రక్రియలో సక్రమంగా సహకరించారు. అకడమిక్ ఆడిట్ అనంతరం, కళాశాల విద్యా ప్రమాణాలు, నిర్వహణ విధానాలు అత్యుత్తమంగా ఉన్నాయని గుర్తించి, పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పలాసకు 'ఏ గ్రేడ్' గుర్తింపు అందజేశారు. ఈ సందర్భంగా అకడమిక్ అడ్వైజర్స్ మాట్లాడుతూ కళాశాలలో నిర్వహిస్తున్న రికార్డులు, బోధన విధానాలు, విద్యార్థుల ప్రగతి నివేదికలు చాలా సమగ్రంగా, సక్రమంగా ఉన్నాయని ప్రశంసించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె. వెంకటలక్ష్మిని, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందిని అభినందిస్తూ కొనియాడారు. ఈ విజయం కళాశాల కుటుంబానికి గర్వకారణమని ప్రిన్సిపాల్ తెలిపారు. భవిష్యత్తులో కూడా విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరచడానికి కృషి కొనసాగిస్తామని వెల్లడించారు.




## పాఠశాలల్లో స్వచ్ఛ రథం.. పాత పుస్తకాల సేకరణ



**నరసన్నపేట, ఏప్రిల్ 2 (వార్త):** నరసన్నపేట ఎంపీడీవో ఆదేశాల మేరకు ప్రభుత్వ పాఠశాలల వద్ద స్వచ్ఛ రథాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు పరిపాలన అధికారి విజయనంద్ తెలిపారు. గురువారం స్థానిక బోర్డు ఉన్నత పాఠశాలలో స్వచ్ఛ రథాన్ని విద్యార్థులకు అందుబాటులో ఉంచామని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థుల నుంచి పాత నోటుపుస్తకాలు, పేపర్లు సేకరించగా సుమారు 60 కిలోల వరకు సేకరణ జరిగినట్లు వివరించారు. సేకరించిన పాత పుస్తకాల మారుగా విద్యార్థులకు ఉపయోగకరమైన వస్తువులను అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవో ద్రాక్షాయిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో చేరికలపై ప్రత్యేక డ్రైవ్



**నరసన్నపేట, ఏప్రిల్ 2(వార్త):** నరసన్నపేట పరిధిలోని కామేశ్వరినగర్ కాలనీ, సాయినగర్, పెద్దపేట ప్రాంతాల్లో బుధవారం సాయంత్రం మండల విద్యాశాఖ అధికారులు న్యూ అడ్మిషన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియంతో పాటు విలువలతో కూడిన నాణ్యమైన విద్య అందిస్తున్నామని తల్లిదండ్రులకు వివరించారు. తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని కోరుతూ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సీఆర్‌టీఎంలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## గ్యాస్ లీక్‌తో చెలరేగిన మంటలు



**నరసన్నపేట, ఏప్రిల్ 2 (వార్త):** కంబకాయ జంక్షన్ ఫ్లైఓవర్ వంతెన సమీపంలోని ఒక బోర్వెల్ దుకాణంలో గ్యాస్ లీక్ కారణంగా మంటలు చెలరేగిన ఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. ఈ ఘటనలో అప్రమత్తమైన దుకాణ సిబ్బంది వెంటనే మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. సమాచారం అందుకున్న స్థానికులు అగ్నిమాపక శాఖకు సమాచారం ఇచ్చారు. హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ప్రమాదంలో ఆస్తి నష్టం సంభవించినట్లు దుకాణ యజమాని తెలిపారు.

## భవనం నుంచి జారిపడి ఇద్దరికి తీవ్ర గాయాలు



**పోలాకి, ఏప్రిల్ 2(వార్త):** రుంకుపేటలో భవనంపై నుంచి జారిపడి ఇద్దరు పెయింటర్లు తీవ్రంగా గాయపడ్డారు. కుసుమ పోలవలసకు చెందిన రువ్వమణి, కింజరాపు శ్రీనివాసరావు భవనాలకు పెయింటింగ్ పనుల కోసం అక్కడికి వెళ్లారు. బుధవారం సాయంత్రం భవనంపై రంగులు వేస్తుండగా, పరంజ తాళ్లు అకస్మాత్తుగా తెగిపోవడంతో ఇద్దరూ కింద పడిపోయి గాయాలపాలయ్యారు. వెంటనే స్థానికులు వారిని నరసన్నపేట ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. గాయాలు తీవ్రమైన కారణంగా మెరుగైన వైద్యం కోసం అనంతరం రిమ్స్‌కు తరలించినట్లు సమాచారం. ఈ ఘటన స్థానికంగా ఆందోళన కలిగించింది.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## కేజీబీవీ ప్రవేశాల గడువు 10 వరకు పొడిగింపు



**జలుమూరు, ఏప్రిల్ 2 (వార్త):** జలుమూరు కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో 2026--27 విద్యా సంవత్సరానికి ప్రవేశాల కోసం ఆన్‌లైన్ దరఖాస్తుల గడువును ఈ నెల 10వ తేదీ వరకు పొడిగించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఏ. యశోద తెలిపారు. 7, 8, 9, 10, 12 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం బాలికల నుంచి దరఖాస్తుల స్వీకరణ ఏప్రిల్ 1తో ముగిసిందన్నారు.

కానీ విద్యార్థులు. తల్లిదండ్రుల అభ్యర్థన మేరకు గడువును పొడిగించినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు సమగ్ర శిక్షణ ఎస్పీడీ బి. శ్రీనివాసరావు (ఐఏఎస్) ప్రకటన విడుదల చేసినట్లు తెలిపారు. ఇప్పటివరకు దరఖాస్తు చేయని అర్హులైన బాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ ప్రవేశాల ద్వారా బాలికలకు నాణ్యమైన విద్య, వసతి సదుపాయాలు అందుబాటులో ఉంటాయని ఆమె వివరించారు.

# రాజధానికి చట్టబద్ధత చారిత్రాత్మక ఘట్టం

### -రాష్ట్రమంతా గర్వించేలా అమరావతి రాజధాని
### -అన్నదాతల త్యాగానికి న్యాయం
### -టీడీపీ శ్రీకాకుళం పార్లమెంటరీ నియోజకవర్గ అధికార ప్రతినిధి దువ్వాడ హేమబాబు చౌదరి

**పలాస, ఏప్రిల్ 2(వార్త):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అమరావతిని ఏకైక రాజధానిగా చట్టబద్ధత కల్పించడం చారిత్మాత్మకమైన నిర్ణయమని తెలుగుదేశం పార్టీ శ్రీకాకుళం పార్లమెంటరీ నియోజకవర్గ అధికార ప్రతినిధి దువ్వాడ హేమ బాబు చౌదరి హర్షం వ్యక్తం చేశారు. గురువారం పలాసలో ఆయన మీడియాతో మాట్లాడుతూ పార్లమెంట్ వేదిక గా ఒకే రాష్ట్రం- ఒకే రాజధాని నినాదంతో అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధి విధానంతో రాజధానిగా అమరావతిని నిర్ణయిస్తూ ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ చేసిన ఏకగ్రీవ తీర్మానానికి చట్టబద్ధత కల్పించే అమరావతి బిల్లు పార్లమెంట్లో ఆమోదించడం కోట్లాది ప్రజలు గర్వించదగ్గ శుభ పరిణామం అన్నారు. దేశంలో ఇతర రాష్ట్రాలకు కంటే దీటైన రాజధాని అమరావతి కాగలదని ఆయన ధీమా వ్యక్తం చేశారు. 175 నియోజకవర్గాల యువతకు ఉద్యోగాల కల్పవల్లి అమరావతి, ప్రతి పంచాయతీ సంక్షేమానికి నిక్షేపం మన ప్రజా రాజధాని అమరావతి అని ఆయన కొనియాడారు. దేశంలోనే కాకుండా ప్రపంచ చరిత్రలో ఏ ప్రజాస్వామ్య దేశంలో కూడా ఇంత భూమిని ఈ విధంగా సమీకరించలేదని, ఒక ప్రపంచ స్థాయి గ్రీన్ ఫీల్డ్ రాజధానిగా అంతర్జాతీయ సలహాదారులతో సుస్థిరమైన, భవిష్యత్తు డిజైన్ తో అమరావతిని రూపొందించడం ముఖ్యమంత్రి చంద్రబాబు కార్య దక్షతకు నిదర్శనమన్నారు. రైతుకు భూమి ఆస్తి తో పాటు వారి జీవనాధారం అయినప్పటికీ, ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు కోసం భా ఉద్వేగంతో భూములను త్యాగం చేశారని హేమ బాబు చౌదరి చెప్పారు. దేశంలోనే మొదటిసారిగా ల్యాండ్ పూలింగ్ విధానంపై చంద్రబాబు నాయుడుపై నమ్మకంతో అమరావతిలో భూములు ఇచ్చిన అన్నదాతల త్యాగాన్ని తెలుగు ప్రజలు ఎప్పటికీ మర్చిపోరని దువ్వాడ హేమ బాబు చౌదరి పేర్కొన్నారు. లోక్ సభలో చట్టబద్ధత లభించడంతో ఇక అమరావతిలో పెట్టుబడులు వరదలో వస్తాయని, నిర్మాణరంగం జోరు అందుకుంటుందని ఆశా భావం ఆయన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తన విజన్ తో అమరావతిని ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్ది, తన బ్రాండ్ ను మరొకసారి చాటుకోవడం ఖాయమన్నారు. ఇప్పటివరకు రాజధాని లేదనే బాధతో ఉన్న ఏపీ ప్రజలు ఇకపై అమరావతి మా రాజధాని అని గర్వంగా తలెత్తుకొని చెప్పుకుంటారని ఆయన స్పష్టం చేశారు. వైయస్సార్సీపి ప్రభుత్వంలో మూడు రాజధానులు ప్రతిపాదన చేస్తే రాష్ట్రవ్యాప్తంగా అన్ని వర్గాల నుంచి తీవ్ర ప్రజా వ్యతిరేకత వ్యక్తం అయిందని ఆయన గుర్తు చేశారు. కులాల పేరుతో రాజధానిని అడ్డుకోవాలని చూపిన వైసిపి కుట్రలకు కాలం



చెల్లిందని, రాష్ట్రమంతా గర్వించేలా అమరావతి నిర్మాణం జరుగుతుందని దువ్వాడ హేమ బాబు చౌదరి ధీమా వ్యక్తం చేశారు.

## అమరావతికి మద్ధతుగా మందసలో దీపాలంకరణ



**మందస, ఏప్రిల్ 2(వార్త):** రాజధానిగా అమరావతి బిల్లు ప్రతిపాదనను కేంద్రం స్వీకరించి అంగీకారం తెలపడంతో మందస మండల పరిషత్ కార్యాలయంలో దీపాలు వెలిగించి, ఆనందం వ్యక్తం చేశారు. కార్యాలయంలో విద్యుద్దీపాలంకరణ చేశారు. అదేవిధంగా ప్రతీ గ్రామంలో ఈ వేడుకలు జరుపుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఈ ప్రోగ్రాంను విజయవంతం చేయడం జరిగిందని అధికారులు చెప్పారు. కార్యక్రమంలో మందస ఎంపీడీఓ వై.వెంకటరమణ, పరిపాలనాధికారి బూరగాన రుష్యేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న కళా ప్రదర్శనలు




**ఇచ్ఛాపురం ఏప్రిల్ 2(వార్త):** ఉత్కల్ దివాస్ శుభ సందర్భంగా ఇచ్ఛాపురం ఒరియా స్కూల్ ఆవరణలో వెంకటేశ్వర మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ చిన్నారుల కూచిపూడి సంబల్పూరి జానపద నృత్యాలు అందరినీ అలరించాయి. నాట్య గురువు బలివాడ శృతి పట్నాయక్ అకాడమీ అధ్యక్షులు చిన్నా గురు స్వామి దంపతుల ఆధ్వర్యంలో సుమారు20.మంది పాల్గొని చక్కని హావభావాలతో నృత్యాలు చేసి అందరినీ ఆకట్టుకున్నారు. చిన్నారులకు బహుమతులు నాట్య గురువులకు ఒడియా పాఠగర్ సభ్యులు పెద్దలు , భువనేశ్వర్ నుండి వచ్చిన పెద్దలచే సాలువలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రేక్షకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


## యువతలో ఆధ్యాత్మికత పెంపొందాలి



**సారవకోట, ఏప్రిల్ 2(వార్త):** యువతలో ఆధ్యాత్మికత పెరగాలని ప్రముఖ ప్రవచన కర్త డాక్టర్ రామ ప్రసాద్ సాహు సూచించారు. గురువారం సారవకోట మండలం కిన్నెరవాడలోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో నిర్వహించిన ఆధ్యాత్మిక సత్సంగం లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, దేశ భవిష్యత్తుకు దోహదపడే యువత ప్రస్తుతం మొబైల్స్‌కు ఎక్కువగా ఆకర్షితులవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. యువత ఆధ్యాత్మికత పట్ల ఆసక్తి పెంచుకొని, మంచి విలువలను అలవర్చుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు.

## డంపింగ్ యార్డులో మళ్లీ మంటలు..

### - విష వాయువులతో ప్రజలకు ఇబ్బంది



**నరసన్నపేట, ఏప్రిల్ 2(వార్త):** నరసన్నపేటలోని డంపింగ్ యార్డులో గురువారం మళ్లీ మంటలు చెలరేగాయి. దీంతో ప్రాణాంతక విషవాయువులతో కూడిన పొగ పట్టణంలోకి వ్యాపిస్తోంది. వ్యర్థ పదార్థాలను కాల్చడం వల్ల దుర్గంధంతో కూడిన వాయువులు వ్యాపించి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు తెలిపారు. ఈ విషవాయువుల కారణంగా ఊపిరితిత్తుల వ్యాధులు కూడా పెరిగే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## ఓటర్ల జాబితా పూర్తి చేయాలి

**నరసన్నపేట, ఏప్రిల్ 2(వార్త):** రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటర్ల జాబితా నమోదు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఎన్నికల నిర్వహణ డిప్యూటీ తహశీల్దార్ శరత్ సూచించారు. గురువారం నరసన్నపేట తహశీల్దార్ కార్యాలయంలో బూత్ లెవెల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొన్ని పోలింగ్ బూత్లలో ఓటరు నమోదు ప్రక్రియ నెమ్మదిగా సాగుతోందని గమనించి, దాన్ని వేగవంతం చేయాలని ఆదేశించారు. మరో వారం రోజుల్లో ఓటర్ల జాబితా పూర్తిచేయాలని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బీఎల్‌వోలు పాల్గొన్నారు.



## కుసుమ పోలవలసలో సీసీ రోడ్లకు శ్రీకారం



**పోలాకి, ఏప్రిల్ 2(వార్త):** కుసుమపోలవలస గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఘనంగా శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ముఖ్య అతిథిగా హాజరై రోడ్డు పనులను ప్రారంభించారు. నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన కూడా పాల్గొన్నారు. గ్రామ ప్రజల సుదీర్ఘకాల డిమాండ్‌గా ఉన్న సీసీ రోడ్ల ప్రారంభం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఇప్పటివరకు మట్టి రోడ్ల వల్ల ఎదురైన ఇబ్బందులకు ఇకపై ముగింపు పలుకుతూ, సౌకర్యవంతమైన రాకపోకలు కలగనున్నాయని తెలిపారు. ముఖ్యంగా వర్షాకాలంలో బురద, నీటి నిల్వల సమస్యలు ఈ సీసీ రోడ్లతో తగ్గనున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మాట్లాడుతూ, గ్రామాల అభివృద్ధే రాష్ట్ర అభివృద్ధికి పునాది అని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రజల అవసరాలకు అనుగుణంగా రోడ్లు, కాల్వలు, తాగునీటి సదుపాయాలను మెరుగుపరచేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సీసీ రోడ్ల నిర్మాణంతో గ్రామంలో రాకపోకలు సులభతరం కావడంతో పాటు పరిశుభ్రత కూడా మెరుగుపడుతుందని తెలిపారు. గ్రామస్థులు మాట్లాడుతూ "మట్టి రోడ్ల వల్ల చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నాం. ఇప్పుడు సీసీ రోడ్లు వేయడం వల్ల మా సమస్యలు తీరనున్నాయి" అని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, గ్రామ పెద్దలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్ల కోసం ఉపాధ్యాయుల ముమ్మర ప్రచారం



**జలుమూరు, ఏప్రిల్ 2(వార్త):** జలుమూరు మండల పరిషత్ మోడల్ ప్రైమరీ స్కూల్‌లో అడ్మిషన్ల పెంపు కోసం ఉపాధ్యాయులు గ్రామాల్లో ముమ్మరంగా పర్యటిస్తున్నారు. ఈ కార్యక్రమం ఎంఈఓ బమ్మిడి మాధవరావు మరియు ప్రసాదరావు ఆధ్వర్యంలో జరుగుతోందని పాఠశాల హెచ్‌ఎం ఐ. మాధవరావు తెలిపారు. ఒక పూట పాఠశాల విధానం ఉండటంతో, ఉపాధ్యాయులు తమ పనివేళ అనంతరం సమష్టిగా గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల ప్రత్యేకతలను వివరించారు. కార్పొరేట్ స్థాయిలో డిజిటల్ తరగతులు, ఇంగ్లీష్ మీడియం బోధన, మెరుగైన మౌలిక సదుపాయాలతో ప్రభుత్వ పాఠశాలలు ఆధునికీకరణ దిశగా ముందుకు సాగుతున్నాయని చెప్పారు. ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజులు, పుస్తకాల పేరుతో జరుగుతున్న దోపిడీకి భిన్నంగా, ప్రభుత్వ పాఠశాలలో ఉచితంగా నాణ్యమైన విద్య అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం. రామారావు, ప్రసాదరావు, సతీష్ కుమార్, అంగన్వాడీ టీచర్లు జయమ్మ, మాలతి మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## సామాజిక తనిఖీ ప్రజావేదిక

**జలుమూరు, ఏప్రిల్ 2(వార్త):** జలుమూరు మండలంలో ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం గురువారం విజయవంతంగా నిర్వహించబడింది. మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) కార్యాలయంలో ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ బృందం నివేదికను సమర్పించింది. పనుల నిర్వహణలో ఉన్న లోపాలు, సమస్యలను ప్రజల ముందుంచి చర్చించారు. గ్రామస్థులు తమ గ్రామాల్లో జరిగిన పనులపై అభిప్రాయాలు వెల్లడిస్తూ పారదర్శకతకు సహకరించారు. పనుల నాణ్యత, ఖర్చుల వివరాలపై ప్రశ్నలు అడిగి అధికారుల నుంచి సమాధానాలు రాబట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీవో చిన్నమ్మడు మాట్లాడుతూ, ప్రజల భాగస్వామ్యంతో సామాజిక తనిఖీ నిర్వహించడం వల్ల పథకాల అమలు మరింత పారదర్శకంగా జరుగుతుందని తెలిపారు. పనుల్లో లోపాలు ఉంటే వెంటనే సరిదిద్దే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సామాజిక తనిఖీ సందర్భంగా మొత్తం రూ.45,000 రికవరీ చేయగా, రూ.14,000 జరిమానా విధించారు. అలాగే నేమ్ బోర్డుల సరిదిద్దే పనులు రూ.56,700 విలువతో చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



## ప్రజా సహకారంతో సేవలందించగలిగాం



**మెళియాపుట్టి, ఏప్రిల్ 2(వార్త):** తమపై నమ్మకంతో సర్పంచ్, ప్రతినిధులుగా ఎన్నుకున్న ప్రజలకు మాకు ఈ ఐదేళ్ల కాలంలో ప్రజలకు సేవలు అందించగలిగేమని వారికి ఎప్పుడు రుణపడి ఉంటామని సర్పంచ్ ఉర్లాన రవికుమార్ అన్నారు. గురువారం నాటితో సర్పంచ్ పదవి కాలం ముగియటంతో యువకులు గ్రామస్తులు సమక్షంలో శుక్రవారం నాడు జరిగిన సర్పంచ్ వార్డు సభ్యుల వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రవికుమార్ మాట్లాడుతూ ఇప్పటివరకు మాకు ప్రజలు, అధికారులు, ప్రజా ప్రతినిధుల సహకారంతో గ్రామాన్ని మాకు సాధ్యమైన మేరకు అభివృద్ధి పథంలో తీసుకువెళ్లడం జరిగిందని ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రవికుమార్ తోపాటు వార్డు సభ్యులు,కార్యదర్శి రామకృష్ణ , వీఆర్వో కేదారి, సచివాలయ సిబ్బంది, న్యాయవాది అంకడాల వేణుగోపాలరావు, ఉప సర్పంచ్ జొన్న మురళి, డివిఎన్ సురేష్ కుమార్, జొన్న హేమంత్, సింహాచలం రామయ్య, తిరుపతిరావు, సోమేశ్వరరావు, బి నారాయణరావు, యువకులు గ్రామస్తులు తదితరులున్నారు.

## సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులకు సత్కారం



**జి.సిగడాం, ఏప్రిల్ 2(వార్త):** జి.సిగడాం మండలం వాంద్రంగి గ్రామానికి చెందిన సర్పంచ్ సాకేటి నాగరాజు, ఎంపీటీసీ బురాడ శ్రీదేవి లను ఎచ్చెర్ల ఎఎంసీ ఉపాధ్యక్షులు బురాడ వెంకటణ, గ్రామ ప్రజాప్రతినిధులు, పెద్దలు అభినందన సన్మాన సత్కారం ను గ్రామ సచివాలయంలో గురువారం నిర్వహించారు. సర్పంచ్ కాలపరిమితి ముగియడంతో అభినందన సత్కారం తెలిపారు. సర్పంచ్ నాగరాజు మాట్లాడుతూ సర్పంచుగా నన్ను గెలిపించి ఐదేళ్లుగా మన గ్రామ అభివృద్ధిలో నాకు సహాకరించిన ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు, అభివందనము తెలిపారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ ఐదు ఏళ్లుగా ప్రజా సేవాలో నిలిచి గ్రామ అభివృద్ధికి కృషి చేసిన సర్పంచ్, ఎంపీటీసీలకు దుస్సాలు, పూల మాలతో గ్రామస్తులు, పెద్దలు, నాయకులు సచివాలయ సిబ్బంది అందరూ కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్పంచ్ గా అధికారానికి కాదు, అభివృద్ధికి ప్రతీకలుగా నిలిచారని. గ్రామాల్లో చేసిన అభివృద్ధి భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలుస్తుందని, గ్రామాలను ఎంతో గొప్పగా అభివృద్ధి చేయడం జరిగిందన్నారు.

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రతి గ్రామంలో రోడ్డు , భవనాలు, త్రాగు నీటి సమస్యలు, తదితర అభివృద్ధి పనులను శరవేగంగా చేశామన్నారు. ప్రజా సమస్యల్లో ఎప్పుడూ అందరిని కలుపుకొని సక్రమంగా విధులు నిర్వహించిన సచివాలయ సిబ్బంది పని తీరు మరివలేనిదని విధి వినాలు బేష్ అని కొనియాడారు. ఇంకా రానన్నా రోజుల్లో సచివాలయ సేవలు ప్రజలకు మరింత మేరుగు పడేలా పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సనపల త్రినాధ రావు, బొట్ట భాస్కరరావు, చింతమల్లేశ్వరావు, పొగిరి జగన్నాథం, పంచాయితీ కార్యదర్శి వడగ గౌరీశంకరరావు, సచివాలయ , ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## బీసీ ధర్మ దీక్షను విజయవంతం చేయండి

**ఇచ్ఛాపురం, ఏప్రిల్ 2(వార్త):** బి సి ల హక్కులకై చారిత్రక ఘట్టం ఏప్రిల్ 11నుంచి బోడె రామచంద్ర యాదవ్ "బిసి ధర్మ దీక్ష" పేరుతో ఆమరణ నిరాహారదీక్ష జరుగుతుందని నియోజకవర్గ అధ్యక్షుడు బడ్డి మురళి చెప్పారు. బీసీల న్యాయమైన హక్కుల సాధనకై భారత చైతన్య యువజన (బీసీవై) పార్టీ అధినేత బోడె రామచంద్ర యాదవ్, ముందుగా ప్రకటించిన విధంగా ఏప్రిల్ 11వ తేదీ నుండి ఆమరణ నిరాహార దీక్ష చేపట్టనున్నారని "బీసీ సింహగర్జన" సభలో ప్రభుత్వం ముందు ఉంచిన ఐదు కీలక డిమాండ్లపై ఇచ్చిన గడువు ముగిసినా ప్రభుత్వం నుండి ఎలాంటి సానుకూల స్పందన రాకపోవడంతో, ఈ నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపిందని చెప్పారు.

బీసీల సామాజిక భద్రత కోసం ప్రత్యేకంగా "బీసీ రక్షణ చట్టాన్ని" వెంటనే అమలు చేయాలని అన్నారు. రాజధాని అమరావతిలో బీసీల ఆత్మగౌరవ భవనాలు, ఇతర అవసరాల కోసం వెయ్యి ఎకరాలు కేటాయించాలని, రాష్ట్రంలో శాస్త్రీయ ప్రాతిపదికన సమగ్ర కులగణన చేపట్టి, బీసీల కచ్చితమైన జనాభా లెక్కలను తేల్చాలని, విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో బీసీలకు వారి జనాభా దామాషా ప్రకారం 44 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, నిర్వీర్యం చేయబడిన బీసీ కార్పొరేషన్లకు తక్షణమే నిధులు విడుదల చేసి, బీసీ యువతకు స్వయం ఉపాధి కల్పించాలని డిమాం చేశారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# విశాఖ జోన్‌లోకి ఇచ్ఛాపురం, పరిసర రైల్వే స్టేషన్లు





**ఇచ్ఛాపురం, ఏప్రిల్ 2(వార్త):** ఈస్ట్ కోస్ట్ రైల్వే భువనేశ్వర్ జోన్ ఖుర్ద డివిజన్ లో వున్న ఇచ్ఛాపురం, ఝాడుపూడి, సోంపేట, మందస, బారువా, సుమ్మదేవి, పలాస రైల్వేస్టేషన్ లు ఈస్ట్ కోస్ట్ రైల్వే జోన్ నుంచి కొత్తగా ఏర్పడుతున్న సౌత్ కోస్ట్ రైల్వే జోన్ విశాఖపట్నంలో ఈ ఆరు రైల్వే స్టేషన్లో కలపమని రైల్వే ఉన్నతాధికారులు ఈ మేరకు ప్రతిపాదనలు పంపారు. కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన నాయుడు అభ్యర్ధన మేరకు ఈ ప్రాంతంలో లో ప్రజల కోరిక మేరకు రైల్వే బోర్డు ఢిల్లీ నుండి జనరల్ మేనేజర్ భువనేశ్వర్ కు, ఖుర్ద డి అర్ ఎం కి విశాఖపట్నం రైల్వే అధికారులు కు ప్రతిపాదనలు పంపమని జనరల్ మేనేజర్ సౌత్ కోస్ట్ కికూడా పరిశీలించమని రైల్వే బోర్డు ఉత్తర్వులు పంపారని జెడ్ అర్ యు సి సి సభ్యులు శ్రీనివాస రౌలో తెలిపారు.

ఇదే విషయాన్ని డి అర్ యూ సి సి సభ్యులు కట్టా సూర్యప్రకాశ రావు కూడా తెలిపారు.

## పారదర్శక పాలన లక్ష్యంగా జిల్లా బడ్జెట్ ఆవిష్కరణ




**నరసన్నపేట, ఏప్రిల్ 2 (వార్త):** ప్రభుత్వ పాలనలో పారదర్శకతను పెంపొందిస్తూ, బడ్జెట్ కేటాయింపులపై ప్రజలకు స్పష్టమైన అవగాహన కల్పించడమే లక్ష్యంగా శ్రీకాకుళం జిల్లా కలెక్టరేట్‌లో 2026–27 ఆర్థిక సంవత్సర జిల్లా బడ్జెట్ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష, నరసన్నపేట నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన పాల్గొన్నారు. అలాగే రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మరియు ఇతర ప్రజాప్రతినిధులు వర్చువల్ విధానం ద్వారా పాల్గొని దిశానిర్దేశం చేశారు. జిల్లాలోని ప్రతి నియోజకవర్గానికి వివిధ శాఖల ద్వారా కేటాయించిన నిధులు, అమలు చేయబోయే అభివృద్ధి పనుల వివరాలను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ వివరించారు. బడ్జెట్ వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచడం ద్వారా ప్రభుత్వ జవాబుదారీతనం పెరుగుతుందని బగ్గు అర్చన తెలిపారు. సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరేలా చూడటంలో ఇటువంటి బహిరంగ కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని ఆమె పేర్కొన్నారు. ప్రభుత్వ వ్యయం, అభివృద్ధి ప్రణాళికలు, సంక్షేమ పథకాల మధ్య సమన్వయం సాధించడం ఈ బడ్జెట్ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. జిల్లా సమగ్ర అభివృద్ధికి ఈ బడ్జెట్ దిశానిర్దేశం చేస్తుందని, ప్రజలు కూడా అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

## అమరావతికి చట్టబద్ధత.. సంబరాలు



**ఇచ్ఛాపురం, ఏప్రిల్ 2(వార్త):** రాష్ట్ర రాజధాని గా అమరావతి బిల్లు పాస్ కావడం తోఇచ్ఛాపురంలో బాణాసంచా కాల్చి ఆనందోత్సాహాలతో సెలబ్రేషన్స్ నిర్వహించారు, ఈ కార్యక్రమం కాళ్ల జైదేవ్, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగు యువత వైస్ ప్రెసిడెంట్ నర్తు అప్పారావు, ఇచ్ఛాపురం మున్సిపాలిటీ ఐటీడీపి అధ్యక్షుడు సాలిన జగదీశ్, ఇచ్ఛాపురం పట్టణ కార్యదర్శి దట్టి శ్రీను 21వ వార్డు యువత తదితరులు పాల్గొన్నారు. పురపాలక సంఘం కార్యాలయం ఆవరణలో ప్రభుత్వం ఆదేశాలను అనుసరించి, అమరావతిని రాష్ట్ర రాజధానిగా పార్లమెంట్ లో తీర్మానంనకు ఆమోదం పొందినందున మున్సిపల్ కమిషనర్ రమేష్ ఆధ్వర్యంలో " మన రాజధాని అమరావతికి దీపహారతులు" కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, మెప్మ సిబ్బంది పాల్గొన్నారు. జనసేనపార్టీ కార్యాలయంలో నాయకులు దాసరి రాజు ఆధ్వర్యంలో దీపారాదనా కార్యక్రమ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జాయింట్ సెక్రటరీ తిప్పన దుర్యోధన రెడ్డి, వైస్ చైర్మన్ దాసరి శేఖర్, డైరెక్టర్ దుంగు భాస్కర్ రెడ్డి, మున్సిపాలిటీ ఇంచార్జ్ పనపాన రుక్మాంధర్, శ్యామ్ రెడ్డి ప్రేమ్ కుమార్, కళ్యా గౌడో వీర మహిళలు తదితరులు పాల్గొన్నారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద అధికారులు కూటమి నాయకులు ఆధ్వర్యంలో లోపింటి పద్మనాభం,దక్కత కామేశ్వరరావు , కరగాన కృష్ణ, పేడీనిదుర్యోధనరాజేంద్రప్రసాద్ ,చంద్రశేఖర్ , లోహిదాసు వినోద్ మౌళి మోహన్ తదితరులు పాల్గొన్నారు.రాష్ట్ర రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ కొండ శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో బెల్లు పడ లో ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద దీపాలు వెలిగించి సంబరాలు నిర్వహించారు. 15 వ వార్డు లో మాజీ కౌన్సిలర్ నందిగామ సరస్వతి ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. జిల్లా తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి ఆసి లీలా రాణి శుభాకాంక్షలు తెలియజేశారు.

## మాదకద్రవ్యాల రహిత సమాజమే లక్ష్యం




**కొత్తూరు, ఏప్రిల్ 2(వార్త):** కొత్తూరులోని అంబేద్కర్ నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద ఎస్.ఐ. కె. వెంకటేశ్ ఆధ్వర్యంలో గురువారం ప్రజలకు, యువతకు 'సంకల్ప' అవగాహన సదస్సు నిర్వహించారు. మాదకద్రవ్యాల నిరోధం, సైబర్ నేరాల పట్ల అప్రమత్తత మరియు అపరిచితుల సమాచారంపై నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎస్.ఐ. ప్రసంగిస్తూ పలు కీలక సూచనలు చేశారు. యువత వ్యసనాల బారిన పడి తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని, గంజాయి వంటి మాదకద్రవ్యాల రవాణా లేదా వినియోగానికి పాల్పడితే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. అనంతరం పెరుగుతున్న సైబర్ మోసాల గురించి మాట్లాడుతూ, గుర్తుతెలియని వ్యక్తులు పంపే లింకులను క్లిక్ చేయవద్దని మరియు ఓటిపి వంటి వ్యక్తిగత వివరాలను ఎవరికీ పంచుకోవద్దని ప్రజలను కోరారు. అలాగే స్థానికంగా ఎవరైనా అపరిచితులు లేదా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలందరూ పోలీసులకు సహకరించాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బందితో పాటు స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## రెవెన్యూ ఉద్యోగుల అమరావతి వేడుకలు

**సోంపేట ఏప్రిల్ 2(వార్త):** జిల్లా కలెక్టర్ పిలుపుమేరకు సోంపేటలో రెవెన్యూ ఉద్యోగులు సమకార్యాలయ ఆవరణలో గురువారం సాయంత్రం రాజధాని అమరావతి వేడుకలు నిర్వహించారు. అమరావతి రాజధానిగా కేంద్ర ప్రభుత్వం చట్టబద్ధత కల్పించిన నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా గురువారం వేడుకలు నిర్వహించుకున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా తాసిల్దార్ అప్పలస్వామి డిప్యూటీ తహసిల్దార్ మహేష్ బాబు మండల సర్వేయర్ నాగేశ్వరరావు సివిల్ సప్లై డిటి కూర్మారావు రెవెన్యూ ఇన్స్పెక్టర్ నిఖిల్ ఇతర సిబ్బంది కొవ్వొత్తులు వెలిగించి ప్రదర్శించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ అప్పలస్వామి మాట్లాడుతూ రాష్ట్ర రాజధానిగా అమరావతిని చట్టబద్ధం చేయడం కీలక పరిణామం అన్నారు. రాష్ట్ర ప్రజలందరికీ ఇది ఒక శుభదినమని పేర్కొన్నారు. చరిత్రలో నిలిచిపోయే ఈ రోజును ప్రతి ఒక్కరు వేడుక నిర్వహించుకోవడం గొప్ప విషయమని అన్నారు.




# రాజధానిపై జగన్ ఊసరవెల్లి రాజకీయాలు

### టీడీపీ మండల అధ్యక్షుడు, కళింగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ భావన దుర్యోధన

**మందస, ఏప్రిల్ 2(వార్త):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతి విషయంలో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అనుసరించిన విధానాలు రంగులు మార్చే ఊసరవెల్లిని తలపిస్తున్నాయని మందస మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, కళింగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బావన దుర్యోధన తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మందస మండలంలోని హరిపురంలో గల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గత ఐదేళ్లలో జగన్ ఆడిన రాజధాని డ్రామాతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పదేళ్లు వెనక్కి వెళ్ళిందని ఆవేదన వ్యక్తం చేశారు. అసెంబ్లీ సాక్షిగా 33వేల ఎకరాల్లో రాజధాని ఉండాలని, విజయవాడ-గుంటూరు మధ్యే రాజధాని ఉండటం సమంజసమని చెప్పిన జగన్, అధికారంలోకి రాగానే ప్లేటు ఫిరాయించారన్నారు. తాడేపల్లిలో ఇల్లు కట్టుకొని నేను అమరావతివాసిని అని నమ్మబలికి, ఐదు కోట్ల ఆంధ్రుల ఆశల రాజధానిపై విషం చిమ్మారన్నారు. ఇది ప్రజలను నట్టేట ముంచడం కాదా? అని దుర్యోధన ప్రశ్నించారు. రాజధానిలో ఇన్సైడర్ ట్రేడింగ్ జరిగిందని, వేల కోట్ల అవినీతి అని సిట్ వేసి కక్ష సాధింపు చర్యలకు దిగారని, కానీ ఐదేళ్లలో ఒక్క తప్పును కూడా నిరూపించలేకపోయారని గుర్తు చేశారు. కేవలం అమరావతిపై బురద చల్లడానికి, చంద్రబాబు నాయుడుపై ఉన్న ద్వేషంతోనే ఈ అవినీతి నాటకం ఆడారని విమర్శించారు. మూడు రాజధానుల పేరుతో జగన్ ఆంధ్రప్రదేశ్‌ను అభాసుపాలు చేశారని, మచిలీపట్నంలో 'మా', విజయవాడలో 'వి', గుంటూరులో 'గన్' కలిపి 'మావిగన్' అంటూ వింత ప్రతిపాదనలు చేసి ప్రజలను వెర్రివాళ్లను చేశారన్నారు. రాజ్యాంగంలో రాష్ట్రానికి రాజధాని ఉండదన్న వితండవాదాలు చేస్తూ మేధావులను సైతం విస్మయానికి గురిచేశారన్నారు. ఇలా పూటకో మాట మాట్లాడుతూ తన పార్టీ కార్యకర్తలనే కన్ఫ్యూజ్ చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందని ఎద్దేవా చేశారు. విశాఖను పరిపాలన రాజధాని చేస్తామని చెప్పింది కేవలం ఋషికొండపై విలాసవంతమైన ప్యాలెస్ కట్టుకోవడానికేనని ఆయన మండిపడ్డారు. రాజధాని కట్టే దార్శనికత జగన్‌కు లేదని, ఋషికొండ ప్యాలెస్ కట్టుకొని అదే రాజధాని అనుకునే మనస్తత్వం ఆయనదన్నారు. అమరావతిని అడవిలా మార్చిన జగన్, మళ్లీ ఏ మొహం పెట్టుకొని ప్రజల ముందుకు వస్తారు?" అని నిలదీశారు.

జగన్ మాటలపై నమ్మకం లేకనే, చంద్రబాబునాయుడు అమరావతిని శాశ్వత రాజధానిగా స్థిరీకరిస్తూ పార్లమెంట్‌లో చట్టం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారని దుర్యోధన తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, లోకేష్ బాబు రాజధాని నిర్మాణాన్ని మళ్లీ పరుగులు పెట్టిస్తున్నారని, జగన్ చేసిన పాపాలను కడిగేసి, రాష్ట్రానికి ఒకే ఒక రాజధానిగా అమరావతిని ప్రపంచ పటంలో నిలుపుటానికి కృషి చేస్తున్న కూటమి పెద్దలకు అలాగే



పార్లమెంట్ లో కూడా బిల్లు పెట్టి ఏకగ్రీవంగా ఆమోదం తెలిపినందుకు భారతదేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర మంత్రులకు, పార్లమెంట్ సభ్యులకు ఈ బిల్లుకు మద్దతు తెలిపిన ఇతర పార్టీల సభ్యులకు నాయకులకు ధన్యవాదాలు తెలియజేస్తున్నానని తెలిపారు.

# చెరువు గట్టును మేసేస్తున్నారు

### -ఆక్రమణలు తొలగించాలని ప్రజల వినతి

### -చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హామీ

**జలుమూరు, ఏప్రిల్ 2(వార్త):** తిమడాం పంచాయతీలో ప్రభుత్వ చెరువు గట్టుపై ఆక్రమణలు జరుగుతున్నాయనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. గ్రామానికి చెందిన దుబ్బాడ చెరువు (సర్వే నంబర్ 85) గట్టును మట్టితో కప్పి ఒక వ్యక్తి ఇంటి నిర్మాణం చేపడుతున్నట్లు స్థానికులు తెలిపారు. గ్రామస్తుల సమాచారం మేరకు, ఈ చెరువు గట్టు మీద గత కొంతకాలంగా వరుసగా ఆక్రమణలు జరుగుతున్నాయని ఆరోపిస్తున్నారు. ఈ ప్రాంతంలో ఒక ఇంటి స్థలం సుమారు రూ.5 లక్షల వరకు ధర పలుకుతుండటంతో, ఆక్రమణదారులు యథేచ్ఛగా చెరువు గట్టును మట్టితో కప్పుతున్నారని పేర్కొన్నారు. పలువురు గ్రామస్తులు ఈ సమస్యను రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ తగిన చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్లుగా సాగునీరు అందిస్తున్న ఈ చెరువు ఇప్పుడు ఆక్రమణలకు



గురవుతోందని చెప్పారు. ఈ విషయంపై తహసీల్దార్ జెన్ని రామారావును సంప్రదించగా, సిబ్బందిని పంపించి ఆక్రమణలను తొలగించి, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. స్థానికులు వెంటనే చర్యలు తీసుకుని చెరువును రక్షించాలని అధికారులను కోరుతున్నారు.

# నేతాజీ కుటుంబానికి జనసేన రూ.5లక్షల ఆర్థికసాయం

### బాధిత కుటుంబానికి చెక్ అందించిన జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్ళూరి



**మందస, ఏప్రిల్ 2(వార్త):** జనసేన పార్టీ క్రియాశీల సభ్యుడు నేతాజీ కొద్దిరోజుల క్రితం జరిగిన ప్రమాదంలో మృతిచెందారు. మందస మండలంలోని పిడిమందస పంచాయతీ మధ్య గ్రామానికి చెందిన నేతాజీ జనసేన పార్టీలో అంకితభావంతో పనిచేసి, క్రియాశీల సభ్యుడిగా అందరి హృదయాల్లో నిలిచిపోయారు. పార్టీ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొని, ప్రజా సేవలో ఎప్పుడూ ముందుండే వ్యక్తిగా ఆయన పేరు సంపాదించారు. ఆయన అకస్మాత్తు మరణం పార్టీకి తీరని లోటుగా నిలిచింది. జనసేన పార్టీ క్రియాశీల సభ్యత్వం కలిగి ఉండటంతో, పార్టీ తరఫున నేతాజీ కుటుంబానికి 5లక్షల రూపాయిలు ఆర్థిక భరోసా అందజేశారు. మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్ళూరి చేతుల మీదుగా నేతాజీ తల్లి పార్వతికి 5లక్షల రూపాయిల చెక్ ని అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు పార్టీ తరఫున ధైర్యం చెప్పి, ఎల్లప్పుడూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి మజ్జి భాస్కరరావు మాట్లాడుతూ జనసేన పార్టీ క్రియాశీల సభ్యత్వం అనేది కేవలం ఒక గుర్తింపు మాత్రమే కాదని, ప్రతీ కార్యకర్త కుటుంబానికి భరోసా కల్పించే ఒక భద్రతన్నారు.

నేతాజీ కుటుంబానికి అందించిన సహాయం, పార్టీ కార్యకర్తల పట్ల మా బాధ్యతను స్పష్టంగా చూపిస్తుందన్నారు. జనసేన పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, జనసేన పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త తన వంతు బాధ్యతగా క్రియాశీల సభ్యత్వం తీసుకోవాలన్నారు. పవన్ కళ్యాణ్ ఆశయాలను నెరవేర్చాలంటే, ప్రతి జనసైనికుడు ముందుకు రావాలన్నారు. పార్టీ కోసం, పవన్ కళ్యాణ్ గారి కోసం, మన భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరు క్రియాశీల సభ్యత్వం తీసుకుని కుటుంబ సభ్యులను కూడా సభ్యత్వంలో చేర్చాలని పిలుపునిచ్చారు. జనసేన పార్టీ కార్యకర్తల సంక్షేమానికి కట్టుబడి ఉందని, ప్రతి కార్యకర్త కుటుంబానికి అండగా నిలుస్తుందని ఈ కార్యక్రమం ద్వారా మరోసారి నిరూపితమైంది. కార్యక్రమంలో నియోజకవర్గం పీఓసీ వేగులవాడ దుర్గారావు, మందస మండలం నాయకులు రౌతు చిరంజీవి పాల్గొన్నారు.

# మన అమరావతి.. మన రాజధాని!

### -ఒకే రాష్ట్రం ఒకే రాజధాని

### -ఆంధ్రుల ఏకైక రాజధాని.. అదే దేవతలు తిరుగాడిన నేల

### -అమరావతి బిల్లుకు పార్లమెంట్ ఉభయ సభల్లో ఆమోదం పొందిన శుభ తరుణంలో పలాసలో అంబరాన్నంటిన సంబరాలు

**పలాస, ఏప్రిల్ 2(వార్త):** ఆంధ్రుల రాజధాని అమరావతిని ఉభయ సభల్లో చట్టబద్ధత పొందడం ఆంధ్రులకు గర్వకారణం అని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష పేర్కొన్నారు. ఎమ్మెల్యే గౌతు శిరీష ఆధ్వర్యంలో తెలుగుదేశం నాయకులతో కలిసి అన్న ఎన్టీఆర్, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ గారి విగ్రహాలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అంతరం బాణాసంచా కాల్చి మిఠాయిలు పంచుకుని సంబరాలు చేసుకున్నారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉభయసభల్లో ఆమోదం పొందడం ప్రజలందరికీ సంతోషంగా ఉందని తెలిపారు. గతంలో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పూటకి ఒక మాట చెప్పి మూడు రాజధానులని చెప్పడం ప్రజలను మోసగించడమేనని, అమరావతికి చట్టబద్ధత



కల్పించడం దేశంలో అన్ని పార్టీలు ముక్తకంఠంగా హర్షం వ్యక్తం చేశాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, జిల్లా గ్రంధాలయ చైర్మన్ పీరుకట్ల విఠల్, ఏఎంసీ చైర్మన్ మల్లా శ్రీనివాసరావు, తెలుగుదేశం పార్టీ పలాస నియోజకవర్గం మూడు మండలాల అధ్యక్ష, కార్యదర్శులు, పట్టణ టీడీపీ అధ్యక్ష కార్యదర్శులు, తెలుగుదేశం అభిమానులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546